ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15 | సంచిక : 07 | మార్చి 2010



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి

(ఫైమ)

చందా

సంవత్సర చందా:రు॥150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


పాలమూరు.. 25-01-2010

వాలమర్రు ..... 30-01-2010

చించినాడ .... 12-02-2010



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-01-2010, పాలమూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ లోకంలో అనేక విద్యలు ఉన్నాయి. అన్ని విద్యలలో ఆత్మవిద్యను నేను అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఆయన నియమించేవాడు, మనం నియమింపబడేవారము. అందుచేత ఆయన దేవుడు అయ్యాడు, మనం జీవులం అయ్యాము. మనం దేవుడిని తెలుసుకుంటే దేవుడు అయిపోము, దేవుడి స్వరూపాన్ని పొందుతాము. ఆయన స్వరూపాన్ని పొందిన వాడికి ఇంక పునర్జన్మలు లేవు. అంతర్యామి అంటే నాకు ఏమీ తెలియటంలేదు అని ఒకరు రమణమహర్షిగారిని అడిగారు. దేవుడు అంతటా వ్యాపించి ఉంటాడు అనేమాట నువ్వు ఎప్పుడైనా విన్నావా అని భగవాన్ అడిగారు. అంతటా వ్యాపించి ఉన్నాడు అనే మాట విన్నాను అన్నాడు. అంతటా ఉన్నవాడు నీలో అంతర్యామిగా ఉన్నాడు. వీడు వేరు, వాడువేరు కాదు. వీడూ, వాడూ ఒక్కడే నువ్వు కంగారుపడకు అన్నారు. భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు అనుకుంటున్నావు. అంతటా వ్యాపించి ఉన్న భగవంతుడే అంతర్యామిగా కూడా ఉన్నాడు. పేర్లు తేడా అంతే. వాడు మనకి సర్వసాక్షి మనకి వచ్చే ఆలోచనలకి, మనకు వచ్చే తలంపులకి, మనం మాట్లాడే మాటలకి ఆయన సాక్షిగా ఉంటాడు. ఆయన కర్మ ఫలాన్ని ఇస్తాడు. ఆయనకి కర్మ ఫలదాత అని పేరు. ఆయన జీవకోటికి, పంచభూతాలకి యజమాని. మీరు ఒక మంచి పని చేసారు అనుకోండి, చేసి ఫలితంకోసం ఎదురుచూడకూడదు. అలా ఎదురు చూస్తే మనస్సు పాడైపోతుంది. అది ఎప్పుడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి ఆ జీవుడికి ఎలా అనుసంధానం చెయ్యాలి ఆ ఎడ్మినిస్ట్రేషన్ అంతా ఆయన చేతిలో ఉంటుంది. మన చేతిలో ఏమీ లేదు. అంతా ఈశ్వరసంకల్పమే. మనం అనుకున్నది జరిగినా, జరగకపోయినా ఆయన సంకల్పమే జరగుతుంది.

మీరు వ్యక్తిభావన పెట్టుకొని, దేహభావన పెట్టుకొని చేసిన కర్మలనిబట్టి మరణానంతర జీవితం ఉంది. నరకానికి వెడితేకొన్ని బాధలు ఉంటాయి, స్వర్గానికి వెడితే కొన్ని భోగాలు ఉంటాయి అన్నీ అనుభవించిన తరువాత మళ్ళీ ఈ భూమి మీదకు రావలసిందే. అవి సాధనకు పనికి వచ్చే లోకాలు కాదు. ఈ భూమి మటుకు సాధనకి పనికివచ్చే లోకం. అందుచేత మీరు టైముపాడు చేసుకోవద్దు. సబ్జక్టు శ్రద్ధగా మీరు శ్రవణం చెయ్యాలి. మన బంధానికి కారణం మన మనస్సే, మన మోక్షానికి కారణం మన మనస్సే. మన మనస్సుని నియమించుకోవాలి. మనం ఏదిగా ఉన్నామో అది మన హృదయంలోనే ఉంది. అక్కడకు మనం చేరుకోవాలి. మేము దాని గురించి వింటున్నాము, దాని గురించి చదువుతున్నాము కానీ మాకు దుఃఖం పోవటం లేదు అంటారు. చదివినంతమాత్రంచేత, విన్నంతమాత్రంచేత దుఃఖం పోదు. అది అనుభవంలోకి వస్తే దాని తాలుక శాంతి, దాని తాలుకా సుఖము మీకు తెలుస్తుంది. మనం ఏమి చేస్తున్నాము అంటే మనోమూలంలోకి వెళ్ళటం మానేసి మనస్సుని ఆలోకానికి పంపుదాము, మనస్సుని ఈ లోకానికి పంపుదాము అని ఇలా అనుకుంటున్నాము. నీకు ఒక రూపంతోటి, ఒక పేరుతోటి లేకపోతే నీకు ఉన్న మంచితనంతోటి, నీకున్న గౌరవాలతోటి తాదాత్మ్యం ఉన్నంతకాలం హృదయంలో ఉన్న సత్యము నీకు తెలియబడదు. ప్రతీ జ్ఞాని కూడా వాడు ఏ స్థానంలో ఉన్నాడో, ఏ సుఖస్వరూపంలో ఉన్నాడో, ఏశాంతి స్వరూపంలో ఉన్నాడో, మనోదేహములతోటి సంబంధం లేకుండా, లోకంతోటి సంబంధం లేకుండా, దేవతలతోటి సంబంధం లేకుండా ఏ ఆధ్యాత్మిక హృదయంలో స్థిరపడి ఉన్నాడో అక్కడకి భక్తులని తీసుకువెళ్ళటం తప్పించి ఆయనకు ఇంకోపని లేదు. గురువు చేసే పని బయటకు కనబడదు. నీకు ఆత్మే గురువుగా కనిపిస్తున్నాడు. లోపల ఉన్నది ఆయనే. గురువు ఏమి చేస్తాడు అంటే హృదయం యొక్క లోతుల్లోకి దిగటానికి నీకు ఏ బలహీనతలు అడ్డువస్తున్నాయో, ఏ అలవాట్లు అడ్డువస్తున్నాయో వాటిని చూసుకుంటూ ఒకోటి ఒకోటి క్లియర్ చేసుకుంటూ దానికి మనం తట్టుకునేలాగ శక్తినిచ్చి అన్నీ క్లియర్ చేసి ఆయన ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిలోనికి తీసుకువెళ్ళే వాడే గురువు. గురువు బోధస్వరూపుడిగా ఉండాలి కాని భక్తుడికి బరువుగా ఉండకూడదు. ఏది నిజమో అది మీకు తెలియకపోయినా ఆయనకు తెలుసు. అక్కడకు గెంటుకొని వెళ్ళేవరకూ గురువు విశ్రాంతి తీసుకోడు. గురువు పని చేస్తూనే ఉంటాడు. ఒకవేళ మనం గురువుని విడిచిపెట్టినా గురువు మనల్ని విడిచిపెట్టడు.

ఓ అరుణాచలేశ్వరుడా నేను నిన్ను తినటానికి వచ్చాను, నువ్వు ఏమి చేసావంటే నేను నిన్ను తినటం ప్రారంభించకముందే నువ్వు నన్ను తినేసి శాశ్వత సుఖములో, ముగింపులేని శాంతిలో, ముగింపులేని ఆనందములో పడేసావు. ఏ వస్తువుకి అయితే చావులేదో దానితోటి నాకు తాదాత్మ్యం కలగజేసావు. అదే నేను అనే అనుభవం కలగజేసాక నాకు మరణభయం

కంప్లీటుగా పోయింది. మనకి వేరుభావన ఉంది. వేరుభావన ఉన్నప్పుడు కోపం వస్తుంది, ద్వేషం వస్తుంది. అన్ని వికారాలు వస్తాయి. మన ఇంట్లో ఒకరిని ఒకరు ప్రేమించుకుంటున్నాము అనుకోండి అది నిజంకాదు. కేవలం మనోదేహములకి సంబంధించినది. స్వార్థపూరితమైనది అది స్వచ్ఛమైన ప్రేమకాదు. జ్ఞానిప్రేమ అటువంటిది కాదు. అది హద్దులు లేనిది, పరిమితులు లేనిది. తల్లి తన బిడ్డని ఎలా ప్రేమిస్తుందో అలాగే టీచరు కూడా స్కూలులో పిల్లలకు ప్రేమగా చెప్పాలి, ఆత్మవిద్య గురించి మీకు చెప్పేటప్పుడు మేముకూడా అలా చెప్పాలి. అంతేగాని లాంఛనాలకోసం చెప్పకూడదు. మేము ఆత్మవిద్య గురించి ఇప్పుడు ఇక్కడ చెబుతున్నాము, కనీసం మీలో ఎవరో ఒకరికి ఆత్మసుఖం తెలిస్తే, ఆత్మశాంతి దొరికితే చాలు మా పని పూర్తి అయిపోయినట్లే. గురువుకి గుర్తింపులు అక్కరలేదు. మనకి ఏ పనిచేసినా గుర్తింపులు కావాలి. గుర్తింపుల వలన వ్యక్తిభావన పెరిగిపోతుంది. మీరు ఎంత శ్రవణం చేసినా, ఎంత మననం చేసినా, మీరు ఎన్ని మంచిపనులు చేసినా హృదయంలో ఉన్న సద్వస్తువు అనుభవంలోనికి వచ్చేవరకూ మీకు సుఖం తెలియదు.

ప్రతీమనిషి కోరుకునేది ఏమిటి అంటే నాకు అసలు దుఃఖస్పర్శ ఉండకూడదు, ఎప్పుడూ సుఖంగా ఉండాలి, శాంతిగా ఉండాలి అని కోరుకుంటాడు. మీకు సర్వస్వం ఉన్నాయి కాని ఎప్పుడూ అశాంతిగా, దుఃఖంగా ఉంటున్నారు అనుకోండి. మీకు శాంతి లేనప్పుడు, సుఖం లేనప్పుడు అవన్నీ మీరు ఏమి చేసుకొంటారు. మన స్వరూపంలో ఉన్నది సుఖమే, ఆ సుఖాన్ని కనుక మనం పొందితే ఇంక చిల్లర సుఖాలమీదకి, చిల్లర సంతోషాల మీదకి మన మనస్సు వెళ్ళదు. మనం హృదయంలోనికి వెళ్ళటానికి ప్రయత్నం చేస్తాము. మనకి చాలా అలవాట్లు ఉంటాయి, ఏదో అలవాటు బయటకు గెంటుకొని వచ్చేస్తుంది. మనం ద్వేషాలు, కక్షలు, కార్పణ్యాలు పెట్టుకుంటే మనం లోపలికి వెళ్ళటానికి తూకం సరిపోదు. మనం ప్రయత్నం చేస్తూ ఉంటే, గురువుపట్ల భక్తి కలిగిఉంటే, గురుస్మరణ చేస్తూ ఉంటే, గురువుపట్ల సజీవమైన విశ్వాసం కలిగిఉంటే ఆ గురువు ఎప్పుడో సడన్‌గా లోపలికి గుంజేసి హృదయస్థానం మనకి ఇచ్చేస్తాడు. అది గురువు చేసేపని. అది ఫైనల్. గురువు దయలేకుండా గురువుని పొందలేము. మన మనస్సు అంతర్ముఖం అయినప్పుడు నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నానో, మీరు ఎంత స్పష్టంగా నన్ను చూస్తున్నారో అంత డైరెక్టుగా ఆయన దయ మనకు తెలుస్తూ ఉంటుంది. గురువుదగ్గర అనుగ్రహం ఉంది అని చెప్పటంకంటే గురువు యొక్క స్వరూపమే అనుగ్రహం. గురువు యొక్క స్వరూపమే శాంతి. గురువు యొక్క స్వరూపమే దయ. శాంతిసామ్రాజ్యంలోనికి మిమ్మల్ని గెంటుకు వెళ్ళటానికి గురువు యొక్క ఒక్క చూపు చాలు, ఒక్క మాట చాలు, ఒక్క స్పర్శచాలు. గురువు ఏ సుఖాన్ని పొందుతున్నాడో ఆ సుఖంలోనికి మిమ్మల్ని మేల్కొల్పలేకపోతే ఈ ఉపన్యాసాలు అనవసరం. ఈ గౌరవాలు, అగౌరవాలు, ఈ

పేర్లు, ప్రతిష్టలు ఇవన్నీ పెంటతో సమానం. ఈ చిల్లర గొడవలమీదకి మన మనస్సును వెళ్ళనివ్వకూడదు. మన డ్యూటీ మనం చెయ్యాలి. మనస్సులో సన్యాసిగా ఉండాలి, మనం ఏమి చేస్తాము అంటే శరీరానికి ఎర్రబట్టలు, మనస్సులో సంసారం. మనం అలా ఉండకూడదు. శరీరం సంసారంలో ఉన్నా మనస్సులో కనుక సన్యాసిగా ఉంటే మనల్ని ఏదీ అంటదు.

మనలను మనం తెలుసుకోవటానికి ఇప్పుడు ప్రయత్నం చేస్తున్నాము అనుకోండి, ఒకవేళ మనల్ని మనం తెలుసుకోలేము అనుకోండి, మనం తెలుసుకోలేకపోయినా ఈ జన్మలో ఎంతోకొంత బుద్ధిసూక్ష్మత పెరుగుతుంది, వివేకం పెరుగుతుంది. చేసిన కృషి ఊరికేపోదు అన్నారు భగవాన్. యజ్ఞం అంటే మనల్ని మనం అర్పించుకుని ఏ పని చేసినా అది యజ్ఞమే. యజ్ఞభావనతోటి పనిచేస్తే మనస్సు పరిశుద్ధమవుతుంది. మీరు పేరు ప్రఖ్యాతులు ఆశించకుండా, గౌరవాలు ఆశించకుండా ఒక మంచిపని చేసారు అనుకోండి. మీరు చేసిన మంచిపని ఇక్కడ ఎవ్వరూ గుర్తించలేదు అనుకోండి అయినా మీ మనస్సు పవిత్రమవుతుంది, మీ మనస్సుకి ఏకాగ్రత కలుగుతుంది, మీ మనస్సుకి నిర్మలత్వం కలుగుతుంది. సత్యాన్వేషణకి మీ మనస్సు తయారవుతుంది. మీరు వ్యక్తిభావన లేకుండా పని చేస్తూ ఉంటే ఇది భగవంతుడి పని అని మీరు చేస్తూ ఉంటే మనస్సు లోపల నెమ్మదిగా అణిగిపోవటం ప్రారంభమవుతుంది. ఈ పని నేను చేస్తున్నాను అని అనుకుంటే మనస్సు విజృంభిస్తుంది. భగవంతుడు మీకు ఏ పని అయితే కేటాయించాడో ఆ పని ఆయనే చేసిపెట్టి ఉంచుతాడు. అది మీరు నిమిత్తమాత్రంగా చేసి పని అయిపోయింది అనుకుంటారు. కానీ భగవంతుడి సంకల్పం వల్లే మనకి ఈ పని అయ్యింది అనే బుద్ధి మనకి రాదు. మన తెలివితేటలవల్ల ఆ పని చేసాం అనుకొంటాము. అప్పుడు అహంకారం ప్రారంభమవుతుంది. దేహాభిమానం పెరిగిపోతుంది. ఈ లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయికాని ఏ ఆకర్షణకి గురికాకుండా భగవంతుడిని దృష్టిలో పెట్టుకొని, భగవంతుడి యొక్క వాక్యాన్ని ప్రమాణంగా తీసుకొని, భగవంతుడి మాటని దైవంగా తీసుకొని ఆ మాటని మనం ఆచరించటం ప్రారంభిస్తే అప్పుడు అనుభవం కలుగుతుంది. నువ్వు చేతులతోటి పనిచేస్తున్నా మనస్సు మాత్రం భగవంతుడి పాదాలయందు ఉండాలి. అది నేర్చుకోండి. ఎందుచేతనంటే బాగుపడవలసింది మనస్సు.

ఆత్మవిద్య లేకుండా ఆత్మ తెలియబడదు. అది మీకు రాకుండా అడ్డుపడేవారు బయట ఎవరూ లేరు. మీ కామక్రోధములే అడ్డుపడుతున్నాయి. కామం అంటే కోరిక, కోరికల్ని నెరవేర్చుకుంటూ కోరికల్ని జయించవచ్చు కదా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నువ్వు చెప్పేది ఎలా ఉంది అంటే మంటపైన పెట్రోలు పోస్తూ ఆ మంట ఆర్పటం ఎటువంటిదో వచ్చిన కోరికలన్నీ నెరవేర్చుకుంటూ కోరికల్ని జయించటం అటువంటిది అన్నారు. కోరికకి సంతృప్తి ఏముంది. మొత్తం భారతదేశం అంతా మీకు ఒక్కరికే రాసి ఇచ్చినా మీకు సంతృప్తి ఉండదు,

సరిపోతుందని అనిపించదు, పక్క దేశం కూడా కావాలని అనిపిస్తుంది. మనస్సు యొక్క మోహం అటువంటిది. మనోనాశనం అయ్యేవరకు నీకు ఆత్మజ్ఞానం కలగదు. ఆత్మజ్ఞానం కలగకపోతే ఆత్మసుఖం తెలియదు. బ్రహ్మవిద్య సంపాదించటానికి నువ్వు ఎంత ప్రయత్నం చేసినా ఈ కామక్రోధాలు నీకు అడ్డువచ్చేస్తాయి. మీరు ఎవరికైనా అపకారం చేసారనుకోండి, నేను అపకారం చేసాను అని అస్తమానూ అనుకోనక్కరలేదు. అది మరచిపోవటమే. ఆ అపకారం అనేది మళ్ళీ చేయకుండా ఉండాలి. అదీ సాధనలో భాగమే. కొంతమంది జరిగిపోయిన గొడవలు అస్తమానూ తలచుకుంటూ ఉంటారు. దానివలన మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. నీ సాధన సరిగ్గా సాగదు. మనకి అవసరం లేని గొడవలు అన్నీ తలపెట్టుకున్నాము అనుకోండి శరీరంలో ఉన్న శక్తి, మనస్సులో ఉన్న శక్తి తగ్గిపోతుంది. మన మనోదేహములు అసలు సాధనకి పనికిరాకుండా పోతాయి. మన దేహయాత్రకు సరిపడి ఈ మనోదేహాలని ఉపయోగించుకోవాలి. మిగతాటైము అంతా లోపల సత్యాన్వేషణకు వాటిని ఉపయోగించాలి. నువ్వు వందేళ్ళు బతికావు. సత్యాన్వేషణ లేదు. నువ్వు ఏమి సాధించినట్టు. జీవించి ఉండగానే మోక్షస్థితి పొందటానికి నీ మనస్సును, నీ దేహాన్ని మేగ్జిమమ్ ఉపయోగించు. అది జీవితగమ్యం. మనిషి జీవన్ముక్తుడు అవ్వాలి. ఒక మనిషి జీవన్ముక్తుడు అయితే లక్షలాది మంది ప్రజలకి అతని ద్వారా మేలు కలుగుతుంది. అతను ప్రసంగాలు చేయనక్కరలేదు, రాతలు రాయనక్కరలేదు. అతని అస్థిత్వం సరిపోతుంది. జీవన్ముక్తస్థితిని పొందిన వాడి ద్వారా శాంతి తరంగాలు, కాంతి తరంగాలు, ముక్తి తరంగాలు వ్యాపించి ఆ స్థితిని మనం కూడా పొందాలనే ప్రేరణ మీకు కలుగుతుంది. సత్‌పురుషులతోటి, సాధువులతోటి, సద్బుద్ధి ఉన్నవాళ్ళతోటి మనం సహవాసం చేస్తూ ఉంటే మనం కూడా అలా ఉండాలి, మనం ఆ స్థితిని పొందాలి అనే బుద్ధి మనకు కలుగుతుంది. అదీ సహవాసం యొక్క మేలు. డబ్బుపోతే సంపాదించుకోగలము కాని కాలంపోతే మళ్ళీ మనం సంపాదించుకోలేము. అందుచేత కాలాన్ని మేగ్జిమమ్ ఉపయోగించుకోవాలి.

భగవంతుడు చెప్పిన మాటపట్ల చాలా శ్రద్ధగా ఉండాలి, అశ్రద్ధ పనికిరాదు. శ్రద్ధ లేకుండా ఎవరికి ఆత్మజ్ఞానం కలగదు అని పరమాత్మ చెప్పాడు. కానీ న్యూటన్ ఏమని చెప్పాడంటే ఒక్క శ్రద్ధ సరిపోదు అది సహనంతో కూడి ఉండాలి, ఓర్పుతో కూడిన శ్రద్ధ ఉండాలి అన్నాడు. హృదయంలో ఒక మహత్తరమైన శక్తి ఉంది. దాని స్పర్శ నీకు కలగకుండా కేవలం నీ ప్రయత్నం వలన నీకు బ్రహ్మజ్ఞానం రాదు అన్నాడు. మనం సూర్యుడిని చూస్తే ఎలా కనిపిస్తాడు. సూర్యుడుని మన చేతిలో పెట్టుకొని ఆడుకోవచ్చు అనుకుంటాము. కానీ సూర్యుడు భూమికంటే పెద్దవాడు. అంటే మీకళ్ళకి కనిపించేది నిజంకాదు, హృదయంలో ఉన్న వస్తువు ఎంత పవిత్రమైనదో, ఎంత ఏకాగ్రమైనదో, అది ఎంతలోతైనదో, ప్రపంచాన్ని నడిపే పదార్థం

ఎంత దోషరహితంగా ఉందో నువ్వు కూడా అంత పరిశుద్ధుడవు అయితేనేగాని అది నీకు తెలియబడదు. న్యూటన్ మనం చేస్తున్న ఇంకో పొరపాటు చెప్పాడు. బ్రహ్మపదార్థం గురించి వెదుకుచున్నారు కాని అది మనకు దొరకటంలేదు. అది మనకి దొరకటంలేదు అని అనుకోవటం మానేసి ఆ బ్రహ్మపదార్థమే లేదు అనుకుంటున్నాము. మనం ప్రయత్నం చేసినా ఆ లోతు అందటంలేదు అని తెలుసుకోవటం మానేసి అసలు ఏమీ లేదు అంతా శూన్యం అనుకుంటున్నాము. బ్రహ్మపదార్థము శూన్యములాగ ఉంటుంది కాని శూన్యము కాదు. అక్కడ లోపాలు లేవు, బలహీనతలు లేవు. అది పెర్ఫెక్టు. అది ఏ స్థాయిలో ఉందో ఆ స్థాయిని పొందితే ఆ వస్తువు తాలుక దయ నీకు కలిగితే అది నీకు తెలియబడుతుంది కాని కేవలం నీ ప్రయత్నం వలన నీవు దానిని పొందలేవు. అందరూ మేము బుద్ధిమంతులము, మేము బుద్ధిమంతులము అనుకుంటున్నారు. మీరు బుద్ధిమంతులని లోపల బ్రహ్మము అనుకోవాలి కదా. మీ నెత్తిమీద మీరే అక్షింతలు వేసేసుకోవటం ఏమిటి? "ఎవడైతే పనిచేస్తున్నా పని చెయ్యనివాడితో సమానమో వాడు బుద్ధిమంతుడు" అని భగవంతుడు గీతలో చెప్పాడు. మీరు కాశీలో రేవు కట్టించారనుకోండి, మీరు కాశీలో రేవు కట్టించారు అని నేను అనకముందు మీ మనస్సు ఎలా ఉందో నేను అన్నాక కూడా మీ మనస్సు అలాగే ఉంటే మీరు బుద్ధిమంతులు. కానీ నేను అన్నాకా మీకు ఎంతోకొంత సంతోషం వస్తే మీకు వ్యక్తీభావన ఉన్నట్లు కదా మీరు ఔట్ అని పరమాత్మ చెప్పాడు.

మనకి జ్ఞానం రాకుండా మనకున్న అలవాట్లే మనకి అడ్డు వస్తున్నాయి. కొంతమందికి అలవాట్లు లోపల చాలా లోతుగా ఉంటాయి. అవి ఎంత లోతుగా ఉంటే నువ్వు అంతకష్టపడి సాధన చేస్తేకాని ఆ అలవాటు బయటకు రాదు. అప్పుడు నీకు గురువు సహాయం ఉండాలి. గురువు యొక్క దయ నోటితో చెప్పలేము, ఆ దయ మాటలకి అందదు. గురువు దయ లేకుండా ఆయనని పొందలేము. గురువు చేసే పని ఏమిటి అంటే ఏది తెలుసుకుంటే మీకు స్వేచ్ఛ కలుగుతుందో, ఏది తెలుసుకుంటే మీరు సుఖి అవుతారో దానిని తెలుసుకోవటానికి మీకు ఇష్టంలేకపోయినా, దానిని తెలుసుకోవాలనే బుద్ధిని కలగజేసేవాడు గురువే. తెలియచెప్పేవాడు గురువే, తెలియబడేది గురువే. మీ హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు. వాడితోటి డైరెక్టుగా మీకు అనుబంధం లేకపోతే ఆ వస్తువుతోటి అనుబంధం ఉన్నవాడితోటి సహవాసం చెయ్యండి. సహవాసం చెయ్యటంవలన ఆ వస్తువు పొందాలి అనే బుద్ధి మీకు కలుగుతుంది. సజ్జనసాంగత్యం ఎటువంటిది అంటే బట్టలు మనలని కొనుక్కోమని చెప్పరు. వాడే కొంటాడు, వాడే కుట్టిస్తాడు. సజ్జనసాంగత్యం అంటే అంతా వాడే చేస్తాడు. సహజంగా వచ్చేగాలి ఎటువంటిదో సజ్జనసాంగత్యం అటువంటిది. సత్పురుషులతోటి సహవాసం చెయ్యగా, చెయ్యగా మీకు ఎంతోకొంత వైరాగ్యం వస్తుంది. వైరాగ్యం, వివేకం ఇవి రెండూ మనకి రెండు

కళ్ళులాంటివి. ఏ మాట వినాలి, ఏమాట వినకూడదు దానికి వివేకం ఉండాలి. కనిపించినదల్లా నాకు కావాలి అంటే వాడికి వైరాగ్యం లేదని అర్థం. పైకి మనం అందరిలాగే ఉండాలి మనం లోపల ఎంతోకొంత వైరాగ్యాన్ని పోషించుకోవాలి. మనం ప్రతీ చిన్న విషయానికి ఉద్రేకపడతాము అనుకోండి ఆలోచనాశక్తి తగ్గిపోతుంది. మన తలంపు, మన ఆలోచన, మన శక్తిని అంతా హృదయం మీద పెడితే, మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచితే హృదయంలో ఉన్న సద్వస్తువు ఏదో టైములో మనకి అనుభవంలోనికి వస్తుంది. అనుకరణ పనికిరాదు. భగవంతుడు ఒకో మనిషికి ఒకో పని కేటాయిస్తాడు. నీ శరీరానికి ఏ పని అయితే కేటాయించాడో ఆ పని ఇష్టంగా, ప్రేమగా చెయ్యి. ఆపని పట్ల నీ మనస్సునీ, దేహాన్నీ అర్పించి చెయ్యి. భగవంతుడికి అర్పించి చెయ్యి. ఆ రకంగా నువ్వు పనిచేస్తే ఆ పని చేస్తూ పనిలేనిస్థితికి ఎదిగివెళ్ళిపోతావు. పని మిమ్మల్ని ముట్టుకోదు. పని మిమ్మల్ని వదిలేస్తుంది. మీ ఇంట్లో మీ డ్యూటీ మీరు చేస్తూ మనం పొందవలసింది వేరే ఉంది అని మనస్సుని భగవంతుడి మీద పెట్టుకోండి. అప్పుడు నీ ధర్మాన్ని నువ్వు బాగా నిర్వర్తిస్తున్నావని అర్థం. ఆ రకంగా చేసినా నీకు హృదయంలో ఉన్న శక్తిపాతం మేల్కొంటుంది. దానికి ఒక్కసారి మెలకువవచ్చిందా మీ పని పూర్తి అయిపోయినట్టే. మీకు బ్రహ్మజ్ఞానం వచ్చేస్తుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-01-2010, వాలమర్రు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సీతమ్మగారి జ్ఞాపకార్థం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసాము. ఆవిడ పరిపూర్ణమైన విశ్వాసం, పరిపూర్ణమైన భక్తి గల వ్యక్తి. కపటంలేని జీవితం ఆవిడది. కొంతమందిలోపల ఒక రకంగా ఉంటారు, బయటకు ఒక రకంగా ఉంటారు. ఇలా లోపల బయట బేధం లేకుండా సీతమ్మగారు ఒకేరకంగా జీవించారు. మీరు సబ్జక్టు బాగా అర్థం చేసుకోవాలి. అసలు మనిషికి దుఃఖం ఎందుకు వస్తోంది, అశాంతి ఎందుకు వస్తోంది, జన్మలు ఎందుకు వస్తున్నాయి. దానికి కర్తృత్వం కారణం అని చెపుతారు. మేము సాధన బాగా చేస్తున్నాము అని చెపుతారు గాని ఒక్కడికీ దేహాభిమానం పోలేదు. మనకు దేహం మీద ఇష్టం పోలేదు. దేహం మీద మనకు ఉన్న ఇష్టం కొలదీ, అభిమానం కొలదీ మన దేహానికి మరణం వస్తే కంగారుపడిపోతాము. అదే ఇతరుల దేహానికి మరణం వస్తే నేను కంగారుపడను ఎందుచేత నంటే ఆ దేహం నాది కాదని నాకు తెలుస్తోంది. ఆ దేహం కూడా నాదే అనుకునే వాడు ప్రజా సేవకుడు అవుతాడు, మహాత్ముడు అవుతాడు. సర్వసాధారణంగా మనం ఇతరులకు సేవ చేసినా వ్యక్తిభావనతో చేస్తాము. దాని వలన పుణ్యం వస్తుంది కాని అజ్ఞానం పోదు. మనం ఇతరులకు ఏదైనా సహాయం చేస్తే వారికి ఉపకారం చేసాము అనుకొంటాము. ఆ దేహం